

నేడు పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా 3.60 లక్షల మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నామని కలెక్టర్ అంబేడ్కర్ ఒక ప్రకటనలో ఆదివారం తెలిపారు. మాత్రల పంపిణీ కోసం ఏర్పాట్లు పూర్తి చేశామని, మాత్రల్ని గుర్ల మినహా అన్ని మండలాలకు ఇప్పటికే అందజేసినట్లు తెలిపారు. జిల్లాలో 34 శాతం మేర నులిపురుగుల వ్యాప్తి ఉందని పేర్కొన్నారు. ఈ వ్యాధి నివారణకు 400 మిల్లీగ్రాములు ఉండే చప్పరించే మాత్రను అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో పంపిణీ చేస్తున్నామన్నారు.



చల్లపేట పీహెచ్‌సీ

ఏది నిజం?



గజపతినగరం ఏరియా ఆస్పత్రి

- గర్భిణి ఉదంతంలో ఆసక్తికర మలుపు
- ఏరియా ఆస్పత్రికి డీసీహెచ్‌ఎస్ క్లీన్‌చిట్
- తప్పును చల్లపేట పీహెచ్‌సీపై నెట్టివేత
- చల్లపేట పీహెచ్‌సీది తప్పులేదన్న డీఎంహెచ్‌వో
- ఏరియా ఆస్పత్రి వద్ద సమస్య వచ్చిందని సుస్పష్టం
- ఏరియా ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యమని 108 సిబ్బంది వెల్లడి
- చర్చనీయాంశంగా డీసీహెచ్‌ఎస్, డీఎంహెచ్‌వో భిన్న ప్రకటనలు

మెంటాడ మండలం కూనేరు పంచాయతీ మిర్తివలస గ్రామానికి చెందిన పాడి గౌరమ్మ ఆస్పత్రుల్లో కాకుండా 108లో ప్రసవించిన ఉదంతంపై జిల్లా వైద్య వర్గాల్లో నేటికీ చర్చ నడుస్తోంది. ఎందుకలా జరిగింది? పీహెచ్‌సీ సిబ్బంది ఏం చెప్పారు? ఏరియా ఆస్పత్రి సిబ్బంది ఎలా స్పందించారు? నిర్లక్ష్యం చేసిందెవరు? తదితర అంశాలపై విడివిడిగా విచారిస్తున్న ఇద్దరు జిల్లా స్థాయి మహిళా అధికారులు వేర్వేరు ప్రకటనలు చేయడం అనుమానాలకు తావిస్తోంది. కేసు తీవ్రతను తగ్గించేందుకు తెరవెనుక ప్రయత్నాలేవో జరుగుతున్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మెంటాడ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి):

కూనేరు పంచాయతీ మిర్తివలస గ్రామానికి చెందిన పాడి గౌరమ్మకు ఈనెల 15న డెలివరీ డేట్ ఇచ్చారని, ఈనెల 4న స్వల్పంగా నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు చల్లపేట పీహెచ్‌సీకి తీసుకువెళ్లగా సాధారణ నొప్పులేనని, డెలివరీకి ఇంకా పది రోజులు సమయం ఉన్నందున జాగ్రత్తగా ఉండాలన్నారని వైద్యులు చెప్పినట్లు ఆమె స్వయంగా తెలిపారు. అత్యవసరమైతే తాము అందుబాటులోనే ఉంటామని వైద్యాధికారి, సిబ్బంది ధైర్యం చెప్పి ఐరన్ ఇంజక్షన్ ఇచ్చి పంపారని గౌరమ్మ, ఆమె కుటుంబ సభ్యులు ఈ ఆరు రోజుల వ్యవధిలో పలుమార్లు 'ఆంధ్రజ్యోతి'కి స్పష్టం చేశారు. మొత్తం పది ఐరన్ ఇంజక్షన్లకు గాను అంతకముందు ఐదు ఇంజక్షన్లు చేశారని పేర్కొన్నారు. కాగా 4న చల్లపేట పీహెచ్‌సీ నుంచి ఇంటికివెళ్లాక మధ్యాహ్నం 3 గంటల సమయంలో నొప్పులు తీవ్రమవడంతో 108 వాహనంలో 5 గంటల ప్రాంతంలో గజపతినగరం ఏరియా ఆస్పత్రికి వెళ్లారు. సాయంత్రం 4 గంటలు దాటాక ఇక్కడ వైద్యులు ఉండరని తెలిసీ ఇక్కడికి ఎందుకు తీసుకొచ్చారని 108 సిబ్బందిపై అసహనం ప్రదర్శించి కనీసం తనిఖీ కూడా చేయకుండా తనను ఘోషాకు రిఫర్ చేశారని, గాజులరేగ సమీపంలో నొప్పులు ఎక్కువ కావడంతో 108 సిబ్బందే చొరవ తీసుకొని తనకు ప్రసవం చేశారన్నది బాధితురాలి మాట. అదే విషయాన్ని 108 సిబ్బంది గౌరినాయుడు, శివ కూడా 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. ఘటనపై మరుసటిరోజు 5న ఆంధ్రజ్యోతిలో (మిగతా 8వ పేజీలో..)



108 వాహనంలో ప్రసవించిన గౌరమ్మ(ఫైల్)

● డీఎంహెచ్‌వో జీవనరాణి ఏమన్నారంటే... చల్లపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణి గౌరమ్మకు సకాలంలో సరైన వైద్యం అందింది. 4న ఆస్పత్రికి వెళ్లగా ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్ ఇచ్చారు. అప్పటికి గర్భిణికి 8.8 వరకు హిమోగ్లోబిన్ శాతం ఉంది. గర్భిణికి నొప్పులు రాలేదు. 15 వరకు డెలివరీ సమయం ఉంది కాబట్టి మూడురోజులు ముందు ఆస్పత్రిలో చేర్పాలని సిబ్బంది, ఏఎన్ఎంలకు వైద్యులు సూచించారు. గర్భిణి ఇంటికి వెళ్లాక మధ్యాహ్నం పురిటినొప్పులు రావడంతో గజపతినగరం ఏరియా ఆసుపత్రికి నేరుగా 108లో వెళ్లారు. అక్కడి వారు ఆసుపత్రి లో చేర్చుకోకుండా ఘోషాకు వెళ్లాలని చెప్పారు. ఏరియా ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని బాధితురాలు ఆరోపిస్తున్నారు. ఘటనపై నివేదిక ఇవ్వాలని సూపరింటెండెంట్‌ను కోరాను.

● డీసీహెచ్‌ఎస్ రాజ్యలక్ష్మి ఏమన్నారంటే... గర్భిణి గౌరమ్మ చల్లపేట ఆస్పత్రికి వెళ్లగా అక్కడి వైద్యులు నొప్పులతో బాధపడుతున్న గర్భిణీని ఇంటికి పంపేశారు. అలాగే ఘోషా అసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడకు వెళ్లకుండా ఏరియా ఆసుపత్రికి వెళ్లడం ఏమిటి? గర్భిణి ఏరియా ఆస్పత్రికి వెళ్లిన సమయంలో వైద్యులు, సిబ్బంది, సూపరింటెండెంట్ ఆసుత్రిలో ఉన్నారు. హైరిస్క్ కేసు కాబట్టి ఘోషాకు రిఫర్ చేశారు. కొన్ని సందర్భాల్లో హైరిస్క్ కేసులు కూడా సాధారణ ప్రసవం జరుగుతాయి.

అనుమతులు 24 గంటల్లోనే..



- భవన నిర్మాణాలకు ఊరట
- కొత్త విధానం తీసుకొచ్చిన ప్రభుత్వం
- స్వయంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం
- అవినీతికి చెక్ పడుతుందా ?

భవన నిర్మాణాల కోసం స్వీయ ధ్రువీకరణ విధానంలో మున్సిపాలిటీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే 24 గంటల్లో అనుమతులు మంజూరు చేసేస్తారు. లబ్ధిదారులకు అనుకూలంగా ప్రభుత్వం కొత్త విధానం తీసుకొచ్చింది. ఇంటి ప్రణాళిక మంజూరులో నెలల కొద్దీ జాప్యాన్ని నివారించడంతో పాటు అవినీతికి చెక్ పెట్టే దిశగా ప్రభుత్వం ఈ కొత్త విధానం తీసుకొచ్చింది. పకడ్బందీగా అమలు జరుగుతుందా అన్నదానిపై ప్రజల నుంచి కొన్ని సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

బొబ్బిలి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి):

భవన నిర్మాణాలకు సంబంధించిన యజమానులు టెక్నికల్ లైసెన్స్‌డ్ ప్లానర్ల సహకారంతో అన్ని రకాల అనుబంధ పత్రాలతో దరఖాస్తు చేసుకుంటే ఆ వెంటనే అనుమతి మంజూరు చేసేలా నూతన విధానాన్ని ప్రవేశపెట్టారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో అక్రమార్కుల బెడద నుంచి భవన యజమానులకు ఊరట ఇచ్చేందుకు ఈవిధానాన్ని ప్రవేశపెడుతున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. అయితే టౌన్ ప్లానింగ్ విభాగంపై అన్నిచోట్లా ఆరోపణలు ఉన్నాయి. బొబ్బిలి మున్సిపాలిటీ కూడా ఆ జాబితాలో ఉంది. గతంలో పలు దఫాలు ఏసీబీ, విజిలెన్స్ అధికారులు బొబ్బిలి మున్సిపాలిటీలో తనిఖీలు నిర్వహించి డజను మంది అధికారులు, సిబ్బందికి (మిగతా 8వ పేజీలో..)

పూర్తి మార్గదర్శకాలు రావాలి

లాలం రామలక్ష్మి, మున్సిపల్ కమిషనరు, బొబ్బిలి

24 గంటల్లో ప్లాన్‌ల మంజూరు సంబంధించిన ఉత్తర్వులు అందాయి. దీనిపై పురపాలకశాఖ నుంచి పూర్తిస్థాయి మార్గదర్శకాలు రావాలి. టౌన్‌ప్లానింగ్ విధానంలో సమూల మార్పుల కోసం ప్రభుత్వం సంకల్పిస్తోంది. నిర్మాణాలకు సంబంధించి పగడ్బందీ పర్యవేక్షణకు యంత్రాంగం కూడా చాలా అవసరమే.

అక్రమార్కుల నుంచి కాపాడటమే లక్ష్యం

రాంబార్కి శరత్‌బాబు, కౌన్సిలర్

24 గంటల్లోగా భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేసే నూతన విధానం స్వాగతించదగ్గదే. అక్రమార్కుల చెర నుంచి భవన యజమానులకు పూర్తిగా రక్షణ కలుగుతుంది. ఈ క్రమంలో లైసెన్స్‌డ్ ప్లానర్ల అజమాయిషీ పెరిగే ప్రమాదం కూడా ఉంది. అవినీతి విధానాలకు ఏ రూపంలో కూడా ఆస్కారం లేకుండా అమలు చేయాలి.



సాగుతున్న బ్రిడ్జి పనులు

ఆర్వోబీ లేట్

- చీపురుపల్లిలో మూడేళ్లుగా రాకపోకలకు అవస్థలు
- ముందుకు సాగని సర్వీస్ రోడ్ల నిర్మాణం
- ఆక్రమణల తొలగింపులో అధికారుల మీనమేషాలు

చీపురుపల్లి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి పట్టణ నడిబొడ్డున చేపట్టిన ఆర్వోబీ(రైల్వే ఓవర్ బ్రిడ్జి) పనులు నత్తనడకగా సాగుతున్నాయి. మూడేళ్లుగా ఈ మార్గంలో భారీ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ప్రయాణానికి స్థానికులు, మూడు జిల్లాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరో ఏడాదైనా పూర్తయ్యే అవకాశం కనిపించడం లేదు.

2023లో బ్రిడ్జి పనులు మొదలు పెట్టినప్పటికీ 2022 మే నుంచి పాత బ్రిడ్జి వినియోగంపై నిషేధం విధించారు. అయితే పనులు ప్రారంభమై రెండేళ్లు పూర్తి కావస్తున్నా ఇంకో యేడాదైనా అందుబాటులోకి వస్తుందా అన్నది సందేహంగానే ఉంది. 1964లో నిర్మించిన పాత బ్రిడ్జి కాలపరిమితి ముగిసిందని, వినియోగానికి పనికిరాదని ఉన్నతాధికారులు నివేదిక ఇవ్వడంతో దీని స్థానంలో కొత్తది నిర్మించడానికి రైల్వే అధికారులు ప్రతిపాదించారు. ఈ మేరకు రైల్వే మంత్రిత్వ శాఖ రూ.12.98 కోట్లు మంజూరు చేసింది. 2023 మార్చిలో రైల్వే శాఖ పనులు ప్రారంభించింది. బ్రిడ్జి పనులకు ఓ రూపం వచ్చినప్పటికీ ఇరువైపులా అనుసంధానంగా ఉండాల్సిన సర్వీసు రోడ్ల నిర్మాణంలో పలు సమస్యలు ఎదురవుతుండడం నూతన బ్రిడ్జి నిర్మాణానికి అవరోధంగా మారింది. వాస్తవానికి హౌరా-చెన్నై ప్రధాన రైల్వే లైను చీపురుపల్లి పట్టణానికి మధ్య నుంచి వెళ్తోంది. దీంతో ఇటు విజయనగర, అటు శ్రీకాకుళం జిల్లాలకు, పాలకొండ, కొత్తూరు తదితర ప్రాంతాలకు కూడా ఇదే ప్రధాన మార్గం కావడంతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. అంతే కాకుండా చీపురుపల్లి పట్టణ పరిధిలోని జి.అగ్రహారం, రిక్షాకాలనీ, గరివిడి మండలంలోని కొండలక్ష్మీపురం వంటి ప్రాంతాలకు వెళ్లడానికి ఈ బ్రిడ్జి, దీనికి ఆనుకొని ఉన్న సర్వీసు రోడ్డే ఆధారం. ఈ కారణంగా (మిగతా 8వ పేజీలో..)



భారీ వాహనాలు వెళ్లకుండా ఏర్పాటు చేసిన ఇనుప గేట్



మధ్యలో నిలిచిపోయిన వాల్ నిర్మాణం

కొత్తవలసలో గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రం

- స్థల పరిశీలనకు ఉన్నతాధికారులు

కొత్తవలస, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రెల్లి గ్రామ రెవెన్యూలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గ్రేహౌండ్స్ దళాల శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనుకున్నట్లు సమాచారం. ఆ శాఖకు చెందిన అధికారులు, రెవెన్యూ అధికారులు ఆదివారం మధ్యాహ్నం రహస్యంగా స్థల పరిశీలన చేశారు. గ్రేహౌండ్స్ దళాల డీజీ ఎ.రవిశంకర్ ఆధ్వర్యంలో ఉన్నతాధికారులు, జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్, తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది కూడా ఉన్నారు. గతంలో రెల్లి రెవెన్యూలో సుమారు 521 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని గిరిజన యూనివర్సిటీ కోసం సేకరించగా వైసీపీ ప్రభుత్వం యూనివర్సిటీని మెంటాడ మండలానికి తరలించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రెల్లి రెవెన్యూకు చెందిన భూములు మళ్లీ తెరపైకి వచ్చాయి. కొత్తవలసలోనే గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని చెప్పినప్పటికీ జిల్లాలో వివిధ సమీకరణాల కారణంగా యూనివర్సిటీని అక్కడే ఉంచేసి రెల్లిలో రాష్ట్ర గ్రేహౌండ్స్ దళాల శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. అందులో భాగంగానే ఆదివారం మధ్యాహ్నం గ్రేహౌండ్స్ డీజీ ఎ.రవిశంకర్, విశాఖ డీఐజీ గోపీనాథరెడ్డి, విజయనగరం ఎస్పీ వకుల్‌జిందాల్ తదితరులు స్థల పరిశీలనలో పాల్గొన్నారు. విలేకరులను అనుమతించలేదు.

7

జీడి మామిడికి మంచు దెబ్బ

- విజృంభిస్తున్న తెగుళ్లు
- ఆందోళనలో రైతులు

విజిబుల్ పోలీసింగ్‌తో నేరాల కట్టడి: ఎస్పీ

వైభవంగా సుగంధ మహోత్సవం

- భక్తులతో కిక్కిరిసిన దర్గా
- వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు
- నేడు ఉరుసు మహోత్సవాల ముగింపు



బాబా చిత్ర పటంతో ఊరేగింపు



7లో

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి):

ఇంటర్ ప్రయోగ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నిఘా నీడలో పరీక్షలు జరగనున్నాయి. సోమవారం నుంచి ఈ నెల 19వ తేదీ వరకూ పరీక్షలు జరుగుతాయి. ప్రతిరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటలు వరకూ, మధ్యాహ్నం రెండు నుంచి ఐదు గంటల వరకూ రెండు దఫాలు జరగనున్నాయి. ఈనెల 5,6,7 తేదీల్లో ఒకేషనల్ విద్యార్థులకు జరగ్గా 10 నుంచి 19వ తేదీ వరకూ జనరల్ గ్రూపు విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. 73 కేంద్రాల్లో ఎంపీసీ గ్రూపునకు సంబంధించి 11056 మంది, బైపీసీ నుంచి 4358 మంది పరీక్ష రాయనున్నారు. ప్రతి విద్యార్థి పరీక్ష కేంద్రానికి అరగంట ముందు హాజరు కావాల్సి ఉంది. ఉదయం 8.30కు ఆన్‌లైన్‌లో ప్రశ్నపత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకోవాలి. ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. థియరీ పరీక్షలు మార్చి మొదటి తేదీ నుంచి 20 వరకూ జరగనున్నాయి. జిల్లాలో ఇంటర్ ప్రయోగ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని, ప్రతి విద్యార్థి పరీక్ష కేంద్రానికి 8.30కు చేరుకోవాలని ఆర్ఐవో మజ్జి ఆదినారాయణ తెలిపారు.



వైభవంగా సుగంధ మహోత్సవం

- భక్తులతో కిక్కిరిసిన దర్గా
- వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు
- నేడు ఉరుసు మహోత్సవాలు ముగింపు



పులి వేషాల సందడి

విజయనగరం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సూఫీ సెహన్‌షా ఆధ్యాత్మిక చక్రవర్తి హుజూర్ హజరత్ సయ్యద్‌బాబా, ఖాదర్‌వలీ 66వ సుగంధ మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు ఉరుసు ఉత్సవంలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఖాదర్‌బాబా దర్గాదర్బార్ జనసంద్రంతో నిండి పండుగ శోభను సంతరించుకుంది. ఖాదర్‌బాబా దివ్యసమాధికి చాదర్, అత్తర్, గులాబీలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు బాబా దర్గాని సందర్శించుకున్నారు. సూఫీ సంప్రదాయంలో అత్యంత పవిత్రమైన ముఖ్యమైన ఈ ఘట్టంను చీమలపాడు అతావుల్లా షరీఫ్‌షా తాజ్ ఖాదరీబాబా దర్గాదర్బార్ పీఠాధిపతి సజ్జదా నసీన్ మహ్మద్‌ఖాజా మోయిద్దీన్, షరీఫ్‌షా తాజ్ ఖాదరీబాబా, విజయనగరం దర్గా దర్బార్ షరీఫ్ ముతావల్లి డాక్టర్ ఎండీ ఖలిలుల్లా షరీఫ్‌షా తాజ్ ఖాదరీబాబా ఆధ్వర్యంలో భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఆచరించారు. ఆదివారం ఉదయం దర్బార్‌లోని ఖాదరీ బాబా అనుశిక్త ప్రతిరూపంగా భావించే చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించిన హంసా వాహనంపై ఊరేగించారు. దర్బార్ నుంచి అబాద్‌వీధి, అంబటి సత్రం, మూడు లాంతర్లు మీదుగా నగర పురవీధుల్లో కన్నుల పండువగా ఊరేగింపు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేశారు. సోమవారంతో ఈ ఉత్సవాలు ముగియనున్నాయి. విజయనగరం డీఎస్పీ ఎం శ్రీనివాసరావు పర్యవేక్షణలో టూటౌన్ సీఐ శ్రీనివాసరావు, సిబ్బంది, పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేశారు.





ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

← బాబా దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

మద్యం దుకాణాల లాటరీ వాయిదా

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియ వాయిదా పడింది. ఎమ్మెల్సీ ఎన్నికల మోడల్ కోడ్ అమలులో ఉన్నందున వాయిదా పడినట్టు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనాథుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కమిషన్ అనుమతి వచ్చిన వెంటనే తదుపరి లాటరీ తేదీని ప్రకటిస్తామన్నారు.

●రాజాం: కల్లుగీత కులాలకు సంబంధించిన మద్యం దుకాణాల లాటరీ వాయిదా పడినట్టు ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీమ్ ఓ ప్రకటనలో తెలిపారు. జిలాల్లో ఎన్నిక కోడ్ అమలులో ఉన్నందున లాటరీ తేదీ వాయిదా పడిందని పేర్కొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వేపాడ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బక్కునాయుడుపేట గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఉషారాణి తెలిపారు. ఆసక్తి గలవారు మార్చి 6 లోపు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలన్నారు. గురుకుల పాఠశాలలో ఉచితంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించామన్నారు. విద్యార్థి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్ష మించని వారు దరఖాస్తులకు అర్హులన్నారు.

కథాలోగిలి పుస్తకావిష్కరణ

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గురజాడ కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం సాయంత్రం సహజ సాంస్కృతిక సంస్థ కథా లోగిలి పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. రచయిత గంటేడ గౌరీనాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాజాం రచయితల వేదిక అధ్యక్షుడు గార రంగనాథం పుస్తకాన్ని ఆవిష్కరించారు. రచయిత అల్లి మోహనరావు పరిచయం చేయగా, ముఖ్యఅతిథిగా విశాఖ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి అడపా రామకృష్ణ, మేడా బుజ్జెమ్మ, మేడా మస్తాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ

విజయనగరం రింగురోడ్డు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ నులి పురుగల దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లాలో ఏడాది నుంచి 19 ఏళ్ల లోపు సుమారు 3 లక్షల మందికి అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్టు డీఎంహెచ్‌వో డాక్టరు జీవరాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మాత్రను నమిలి మింగాలన్నారు. పిల్లల్లో నులి పురుగులు నశించి రక్తహీనత రాకుండా కాపాడుతుందన్నారు. అంగన్‌వాడీలు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

శారదా నదిలో పడి విజయనగరం వాసి మృతి

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం అనకాపల్లిలోని శారదా నదిలో ప్రమాదవశాత్తూ జారిపడి ఓ వృద్ధుడు మృతిచెందినట్టు ట్రైనీ డీఎస్పీ ఎంవీకే చైతన్య తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. విజయనగరానికి చెందిన షేక్ ఇస్మాయిల్ (63) శుక్రవారం సాయంత్రం అక్కడి నుంచి అనకాపల్లి పట్టణానికి ఆనుకొని ఉన్న దేవీనగర్‌లో నివాసముంటున్న చెల్లెలు తాజు ఇంటికి బస్సులో బయల్దేరారన్నారు. అనకాపల్లి వచ్చిన ఆయన శారదా నది ఒడ్డున శివాలయం సమీపంలో నదిలో దిగే సమయంలో ప్రమాదవశాత్తూ జారిపడిపోయి మృతిచెంది ఉంటారని భావిస్తున్నట్టు చెప్పారు. ఆదివారం ఉదయం నదిలో మృతదేహం తేలి ఉండడాన్ని కుటుంబ సభ్యులు గుర్తించారన్నారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

దివ్యాంగుడికి సత్కారం

రాజాం రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పెనుబాక గ్రామానికి చెందిన దివ్యాంగ కళాకారుడు భుజంగరావును వరంగల్ జిల్లా హనుమకొండలో ఆదివారం ఘనంగా సత్కరించారు. హనుమకొండలోని డా.బి.ఆర్.అంబేద్కర్ భవన్‌లో విద్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల దివ్యాంగ కళాకారులచే నిర్వహించిన సాంస్కృతిక ఉత్సవంలో భుజంగరావు డాన్స్ చేసి అందరి మన్ననలు పొందాడు.

విజిబుల్ పోలీసింగ్‌తో నేరాల కట్టడి

- ఎస్పీ వకుల్ జిందాల్



ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోలీసు అధికారులు, సిబ్బంది నేరాల నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని ఎస్పీ వకుల్ జిందాల్ ఒక ప్రకటనలో తెలిపారు. నేరాలు తగ్గుముఖం పట్టేందుకు విజిబుల్ పోలీసింగ్ ప్రధాన భూమిక పోషిస్తుందన్నారు. ప్రజలు, యువత, వాహనదారులకు, రహదారి భద్రత, మహిళల భద్రత, సైబర్, మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన కల్పించాలన్నారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలు చేపడితే ఎటువంటి శిక్షలు ఉంటాయో వివరించాలన్నారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే ఉపేక్షించవద్దని ఆదేశించారు. స్టేషన్ పరిధిలోని హిస్టరీ షీట్ వ్యక్తులను వారంలో ఒకసారి పిలిపించి సత్ప్రవర్తనతో వారు జీవించే విధంగా కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు రక్షణగా నిలిచే చట్టాలపై సైబర్ మోసగాళ్లు అవలంబించే విధానాలను వివరించి అప్రమత్తం చేయాలని ఎస్పీ ఆదేశించారు.

అమ్మవారి జాతరకు పందిరిరాట



పందిరిరాటను వేస్తున్న దృశ్యం

చీపురుపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 2, 3, 4 తేదీల్లో చీపురుపల్లిలో జరగనున్న కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవాలకు ఆదివారం పందరిరాట వేశారు. అమ్మవారి ఆలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రౌతు కామునాయుడు, నిర్వహణ కమిటీ ప్రతినిధి గవిడి నాగరాజు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో బి. శ్రీనివాస్, అర్చకులు ఆరవిల్లి రవికుమార్, నాయకులు ఎస్వీ కామేశ్వరరావు, గవిడి వాసు, లెంక చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

జొన్నవలసలో రాజేశ్‌వర్మ జన్మదిన వేడుకలు



రాజేశ్‌వర్మతో టీడీపీ నాయకులు

విజయనగరం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవలసలోని నివాసంలో టీడీపీ జిల్లా కార్యాలయం కార్యదర్శి పూసపాటి రాజేశ్‌వర్మ జన్మదిన వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నగర, మండల నాయకులు రాజేశ్‌వర్మతో కేక్‌కట్ చేయించారు. అంతకుముందు ఆయన జిల్లా పార్టీ కార్యాలయంలో సీనియర్ నేత కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతి రాజును కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. విజయనగరం ఎమ్మెల్యే అతిది గజపతిరాజు ఫోన్‌లో రాజేశ్‌వర్మకు శుభాకాంక్షలు తెలియజేశారు. వీరితో పాటు టీడీపీ నాయకులు ఆయనకు వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా, బొకేలు పుస్తకాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పినమేవలి వృద్ధాశ్రమంలో రాజేశ్‌వర్మ అభిమానులు వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు.

గణితం క్విజ్ పోటీల్లో లక్ష్మీపురం విజేత



గణితం క్విజ్ పోటీలో విజేతలు వీరే..

రేగిడి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో సంకిలి హైస్కూల్‌లో ఆదివారం సిక్కోలు గణిత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మండల స్థాయి గణిత క్విజ్ పోటీలు నిర్వహించారు. 6, 7 తరగతుల వారికి నిర్వహించిన పోటీల్లో లక్ష్మీపురం హైస్కూల్ విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచారు. రేగిడి హైస్కూల్, అంబఖండి హైస్కూల్ వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు సంకిలి హైస్కూల్ హెచ్ఎం రామినాయుడు, గణిత ఉపాధ్యాయులు హరిబాబు, కృష్ణంరాజు, రవికిరణ్, ప్రసాద్, హిందీ ఉపాధ్యాయుడు గణపతిరావు బహుమతులు ప్రదానం చేశారు.

టంకాల కుటుంబానికి పరామర్శ

రేగిడి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో చిన్నశిర్లాం సీనియర్ టీడీపీ నేత టంకాల గోవిందరావు ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, చీపరుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకట్రావు ఆదివారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ మంచి కార్యకర్తను కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు. కళా వెంట టీడీపీ నేత కె.మహేష్, గోవిందరావు ఉన్నారు.

కళాను కలిసిన ఎంపీ కలిశెట్టి



కళాతో మాట్లాడుతున్న కలిశెట్టి

రాజాం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావును విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కిమిడి సోదరుడు కిమిడి సత్యనారాయణ నాయుడు ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో కళాను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు అనంతరం రాజకీయాలపై చర్చించుకున్నారు.

బాధితులకు కలిశెట్టి పరామర్శ

దత్తిరాజేరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదమానాపురం రైల్వే లైన్ బాధితులను ఆదివారం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పరామర్శించారు. బాధితులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. 28 మంది బాధితులు ఎటువంటి ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు.

అవినీతిపరులకు గుణపాఠం: గద్దె

చీపురుపల్లి, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి): 2024లో ఏపీలో ఎన్నికల ఫలితాలు, ఇటీవల వెలువడిన ఢిల్లీ ఎన్నికల ఫలితాలు అవినితిపరులకు గుణపాఠం కలిగించేవిగా ఉన్నాయని మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల కోసం పనిచేయని పార్టీలకు ప్రజలు తగిన శాస్తి చేశారన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మోదీ నాయకత్వానికి అక్కడి ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. మద్యం కుంభకోణంలో కేజ్రీవాల్‌ని అరెస్టు చేయడం సరైన చర్య అని ప్రజలు తీర్పు ఇచ్చారన్నారు. మోదీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అన్నిరంగాల్లో ముందుకు దూసుకుపోతోందన్నారు. మోదీ ప్రభుత్వంపై ఎటువంటి అవినీతి ఆరోపణలు లేవన్నారు. కూటమితో జత కట్టిన తరువాత మన రాష్ట్ర పరిస్థితి కూడా మారిపోయిందని బాబురావు పేర్కొన్నారు.

ఘనంగా వివేకానందస్వామి తీర్థం



బండ్ల పరుగు పోటీలో దౌడు తీస్తున్న ఎడ్లు

వేపాడ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకులసీతంపేటలో ఆది వారం రెండోరోజూ వివేకానందస్వామి తీర్థమహోత్సవం ఘనంగా నిర్వహించారు. తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకుని స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మంచిన అప్పలసూరి సౌజన్యంతో నిర్వహించిన కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగాయి. మధ్యాహ్నం నిర్వహించిన ఎడ్ల బండ్ల పరుగు పోటీలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ రామునాయుడు, సర్పంచ్ రమణమ్మ, మాజీ సర్పంచ్ అప్పలసూరి, ఎంపీ టీసి సభ్యుడు అడపా ఈశ్వరరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సందడిగా ఫోర్టుసిటీ వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థిని

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఫోర్టుసిటీ పాఠశాలలో 13వ వార్షికోత్సవాన్ని రెండోరోజు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ ప్రధాన అంశంగా విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు, నృత్యాలు అందరినీ అలరించాయి. ఈసందర్భంగా స్కూల్ చైర్మన్ కేఏపీ రాజు మాట్లాడుతూ తమ విద్యార్థులకు విద్యతో పాటు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వైజ్ఞానిక ప్రదర్శనలకు అధిక ప్రాధాన్యనిస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్కూల్ వైస్ చైర్మన్ చంటి, ప్రిన్సిపాల్ రేయినా ఖాన్, డైరెక్టర్లు మధు, నీలిమ, అశోక్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆదిత్యుడి సేవలో నెల్లిమర్ల ఎమ్మెల్యే



స్వామివారి జ్ఞాపికను అందజేస్తున్న అర్చకుడు

అరసవల్లి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ (ఆదిత్యుడు) స్వామివారిని విజయనగరం జిల్లా నెల్లిమర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే లోకం మాధవి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా.. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. అర్చకులు ఇప్పిలి సాందీపశర్మ వారికి స్వామివారి జ్ఞాపికను అందజేశారు.

జీడి మామిడికి మంచు దెబ్బ

- విజృంభిస్తున్న తెగుళ్లు
- ఆందోళనలో రైతులు

రాజాం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): చిగురు, పూత దశలోని జీడి మామిడి తోటలపై పొగ మంచు తీవ్ర ప్రభావం చూపుతోంది. ఏటా ఈ సీజన్లో మంచు ప్రభావం సాధారణమేనైనా ఎన్నడు లేనంతగా కొద్ది రోజులుగా మంచు కురుస్తోంది. ఫలితంగా పూత రావడం లేదని, కొన్నిచోట్ల వచ్చిన పూత మాడిపోయి మొండి రెమ్మలు దర్శనమిస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి జిల్లాల్లో సుమారుగా 3 వేల ఎకరాల వరకు మామిడి, 4 వేల ఎకరాల వరకు జీడి సాగవుతోంది. కళ్ల మందే మాడిపోతున్న పూతను చూసి రైతులు లబోదిబోమంటున్నారు. ఈ ఏడాది కూడా నష్టం తప్పదని రైతులు తలలు పట్టుకుంటున్నారు.



మంచుతో మాడిపోతున్న మామిడి పూత

క్రైం న్యూస్

వివాహిత ఆత్మహత్య

గుమ్మలక్ష్మీపురం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురం శివారులో గల తమ సొంత తోటలో వివాహిత జన్ని రజని(32 అనుమానాస్పద స్థితిలో చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందింది. వివాహిత భర్త ఉదయ్‌కుమార్ పార్వతీపురం మన్యం కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూశాఖ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. వివాహిత మరణించిన ప్రదేశంలో గుళికల మందును పోలీసులు గుర్తించారు. రజని మరణం హత్యా.. ఆత్మహత్య అనే కోణంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎల్విన్‌పేట ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించామని చెప్పారు. ఎల్విన్‌పేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

భోగాపురం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలం సవరవల్లి సమీప జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలయ్యారని ఏఎస్‌ఐ తవుడు తెలిపారు. పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం కుశాలపురానికి చెందిన యాగంటి కృష్ణారావు ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. తన యజమానిని తీసుకువచ్చేందుకు వాహనంపై డ్రైవర్ రమేశ్‌తో కలిసి శనివారం రాత్రి విశాఖ రైల్వే స్టేషన్‌కు వెళ్లారు. యజమానిని వాహనం ఎక్కించుకుని తిరిగి విశాఖ నుంచి శ్రీకాకుళం వైపు వస్తున్న సమయంలో సవరవల్లి సమీపంలో ముందు వెళ్తున్న లారీని తప్పించబోయి వాహనం డివైడర్‌ను ఢీకొంది. దాంతో కృష్ణారావుకు తీవ్రగాయాలయ్యాయి. డ్రైవర్ రమేశ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఇద్దరు శ్రీకాకుళంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్‌ఐ తవుడు తెలిపారు.

మద్యం సీసాలతో ఇద్దరి అరెస్టు

నెల్లిమర్ల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల మండలం కొండవెలగాడ, గుర్ల మండలం గోషాడ జంక్షన్ ప్రాంతాల్లో ఆదివారం చేపట్టిన దాడుల్లో మద్యం బాటిళ్లతో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశామని ఎక్సైజ్ సీఐ ఎం.వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొండవెలగాడలో పట్టుబడిన వ్యక్తి నుంచి 7 మద్య సీసాలను, గోషాడలో పట్టుబడిన వ్యక్తి నుంచి 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

18 మందిపై కేసు నమోదు

రాజాం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మద్యం బెల్ట్ దుకాణాలు నియంత్రణ చర్యల్లో భాగంగా జనవరి నుంచి ఫిబ్రవరి 9 వరకు నిర్వహించిన దాడుల్లో 18 మందిపై కేసులు నమోదు చేసి, వారి నుంచి 176 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ఆర్.జైభీమ్ ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా మద్యం బెల్ట్ దుకాణాలు నిర్వహించినా, దుకాణాల నిర్వహణకు వేలం పాటలు నిర్వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి..

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల మండలం సతివాడలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న బి.కంచెయ్యను ఆదివారం అరెస్టు చేసి అతడి నుంచి 9 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఇందిరాదేవి తెలిపారు. తదుపరి చర్యలు నిమిత్తం ప్రొహిబిషన్ ఎక్సైజ్ నెల్లిమర్ల స్టేషన్‌కు అప్పగించామన్నారు. దాడుల్లో ఎస్‌ఐ రాజశ్రీ, హెచ్‌సీ నాగేశ్వరరావు, ఈసీలు నాయుడు, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ దుకాణాలపై దాడి..

భోగాపురం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడెపువలసలో నిర్వహిస్తున్న మద్య బెల్ట్ దుకాణంపై దాడి చేసి అదే గ్రామానికి చెందిన మహిళను ఆదివారం అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ వి.రవికుమార్ తెలిపారు. అక్రమంగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు దాడి చేసి 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తిని అరెస్టు చేసినట్టు తెలిపారు. అలాగే ఎన్నికల కోడ్ కారణంగా ఈనెల 10న కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన మద్యం దుకాణాల వేలం వాయిదా వేసినట్టు సీఐ తెలిపారు.

చెరకు లారీ బోల్తా: ట్రాఫిక్ జామ్

రేగిడి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో బూరాడ-కొర్లవలస మధ్య ఆదివారం సాయంత్రం చెరకు లారీ బోల్తా పడింది. ఈ ఘటనలో పాలకొండ-రాజాం రూట్‌లో గంట పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రాజాం నుంచి సంకిలి సుగర్ ఫ్యాక్టరీకి వస్తున్న లారీ ఓవర్ లోడ్ వచ్చి ఒకవైపు ఒరగటంతో ఈ ప్రమాదం చోటు చేసుకొంది. ఎలాంటి హాని జరగకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. రేగిడి పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ



సరుకులు అందజేస్తున్న మారుతీ ప్రతినిధులు

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కణపాక ఆగురువీధిలోని ఆదివారం మారుతీ స్వయం సేవాసంఘం ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం జరిగింది. దాదాపు 50 మందికి నెలకు సరిపడే సరుకులను అందజేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు గుత్తూరు చంద్రశేఖర్, అరసాడ అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు. ● నగరంలోని దాసన్నపేటలో నవాబుపేట రామమందిరం వద్ద గోకుల కృష్ణ సేవాసంఘం ఆధ్వర్యంలో 50 మంది నిరుపేదలకు 5 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేశారు. గార కృష్ణమ్మ జ్ఞాపకార్థం ఆమె కుటుంబసభ్యులు బియ్యాన్ని సమకూర్చారు.

ప్రజ్ఞా వికాసం పరీక్ష విజయవంతం

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా టెన్త్ విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక ఎయిమ్స్ కాన్సెప్ట్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ప్రజ్ఞా వికాసం మోడల్ టెస్ట్ విజయవంతమైంది. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు రామ్మోహన్, వెంకటేష్, రాము పాల్గొన్నారు.

●రాజాం: రాజాం పట్టణంలో ఆదివారం టెన్త్ విద్యార్థులకు ప్రజ్ఞా వికాసం పేరిట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మోడల్ టెస్ట్ జరిగింది. అధికసంఖ్యలో విద్యార్థులు పరీక్షలో పాల్గొన్నారు. పరీక్షను ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పి.రమేశ్, జిల్లా కమిటీ కో-గర్ల్ కన్వీనర్ బి.రూప పర్యవేక్షించారు. కార్యక్రమంలో రాజాం నాయకులు షన్ముఖ, అభి, శ్రీరామ్, సత్యనారాయణ, ధనుంజయ్ పాల్గొన్నారు.

ముగిసిన హిందీ పరీక్షలు

రాజాం రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత హిందీ ప్రచారసభ ఆధ్వర్యంలో రెండురోజులుగా రాజాంలో నిర్వహిస్తున్న హిందీ పరీక్షలు ఆదివారంతో ముగిశాయని హిందీ ప్రచారక్ కొండవలస మధుసూదనరావు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక, మధ్యమ, రాష్ట్రభాష, ప్రవేశిక, విశారద, ప్రవీణ పరీక్షలకు 212 మందికి గాను 210 మంది హాజరయ్యారని తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్ ఎ.మహేశ్వరరావు సారథ్యంలో నిర్వహించిన పరీక్షలకు రాజాం, రేగిడి, వంగర, జి.సిగడాం, పొందూరు, తెర్లాం, చీపురుపల్లి మండలాలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారన్నారు. ఎంఈవో దుర్గారావు పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారని మధుసూదనరావు తెలిపారు.

40 యూనిట్ల రక్తం సేకరణ

దత్తిరాజేరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుల రామచంద్రాపురంలో ఆదివారం అమ్మ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటైంది. ముఖ్యఅతిథిగా అభ్యుదయ ఫౌండేషన్ అధ్యక్షురాలు డాక్టర్ చింతల శారద హాజరయ్యారు.కార్యక్రమంలో సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు సాయి కుమార్, అమ్మ ఫౌండేషన్ అధ్యక్షుడు, ఎన్వీఎన్ బ్లడ్ బ్యాంకు మేనేజర్ నాగేశ్వరరావు, రాజుల రామచంద్రపురం గ్రామపెద్దలు శివరామరాజు, శ్రీనివాసరాజు, కృష్ణంరాజు, తిరుపతిరావు, గౌరినాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 40 యూనిట్ల రక్తాన్ని సేకరించారు.

కార్యకర్తలపై వివక్ష సహించం

పూసపాటిరేగ, ఫిబ్రవరి9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యకర్తలపై వివక్ష చూపితే సహించేదిలేదని వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ప్రజాప్రతినిధులు ఆదివారం సీఐ రామకృష్ణ, ఎస్ఐ దుర్గాప్రసాద్‌తో అన్నారు. పలు కేసులో వైసీపీ క్యాడర్‌పై పక్షపాత వైఖరి చూపడం తగదన్నారు.

ఆర్వోబీ 'బీ లేట్'

(ఐదో పేజీ తరువాయి)

బ్రిడ్జి నిర్మాణం ఎంత అవసరమో, సర్వీసు రోడ్ల నిర్మాణం కూడా అంతే అవసరం. తమ ప్రాంతాలకు వెళ్లాల్సిన సర్వీసు రోడ్ల నిర్మాణం పూర్తయినంత వరకూ బ్రిడ్జి పనులు సాగనివ్వబోమని రిక్షా కాలనీ, కొత్తగ్రహారం, జి.అగ్రహారంలోని కొన్ని ప్రాంతాలకు చెందిన వారు గత కొంత కాలంగా పట్టుబడుతున్నారు. అయితే సర్వీసు రోడ్లు నిర్మించాల్సిన స్థానంలో ఇరు వైపులా నివాసాలు, దుకాణాలు ఉండడంతో వాటి తొలగింపు కూడా సమస్యగా మారింది. సర్వీసు రోడ్ల నిర్మాణం వల్ల తమకు తీవ్రంగా నష్టం ఏర్పడుతుందని, దుకాణాలు పోయి, తమ బతుకులు రోడ్డున పడతాయని చిన్న చిన్న వ్యాపారాలు చేసుకొనే వారు ఆవేదన చెందుతున్నారు.

● ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు ఇప్పటికే స్థానికుల్ని కలిసి మాట్లాడారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకున్నారని, అయినప్పటికీ పూర్తిగా తొలగించకుండా బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని మాత్రమే అడుగుతున్నామని నచ్చజెప్పారు. ఈ నిర్మాణానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ ఆక్రమణల తొలగింపు పూర్తి కాలేదు. ఆర్వోబీ నిర్మాణం పూర్తి కాకపోవడంతో రాజాం, పాలకొండ ప్రాంతాలకు వెళ్లాల్సిన బస్సు సర్వీసులు మూడేళ్లుగా వేరే మార్గంలో తిరుగుతున్నాయి. ప్రజాప్రతినిధులు ఈ సమస్యపై దృష్టి పెట్టి ఆర్వోబీ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అనుమతులు 24 గంటల్లోనే..

(ఐదో పేజీ తరువాయి)

తాఖీదులు పంపిన సంగతి తెలిసిందే. అయినా అవినీతికి చెక్ పడిన దాఖలాల్లేవు. యథేచ్ఛగా అక్రమార్కులు వారి కార్యకలాపాలను కొనసాగిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

● భవన నిర్మాణాలకు పూనుకున్న వారికి సాంకేతిక పరమైన అవగాహన ఉండడం లేదు. వారంతా లైసెన్స్‌డ్ ప్లానర్లు చెప్పిందే వేదంగా భావిస్తున్నారు. వారు టౌన్‌ప్లానింగ్ అధికారులను లోబరుచుకోవడం సర్వసాధారణంగా జరుగుతోంది. కొన్నిచోట్ల టౌన్ ప్లానింగ్ సిబ్బందికి అవగాహన లేమి కారణంగా లైసెన్స్‌డ్ ప్లానర్లు ఎలా చెబితే అలా నడుచుకుంటున్నారు. నూతన విధానంలో స్వీయదరఖాస్తు చేసుకున్న 24 గంటల్లోగా అనుమతులు మంజూరు చేస్తామనడం శుభ పరిణామం. ఏ మేరకు విజయవంతం అవుతుందా? అని అందరూ ఆసక్తిగా గమనిస్తున్నారు.

● గతంలో ఉండే పోస్ట్ వెరిఫికేషన్ విధానాన్ని కూడా తొలగించడంతో భవన నిర్మాణ యజమానులకు ఊరటే. అయితే బహుళ అంతస్తు భవన నిర్మాణాలకు ఈ తరహా విధానం అక్రమార్కుల పాలిట వరం అవుతుందన్న భావన వినిపిస్తోంది.

● దరఖాస్తుదారే అన్ని వివరాలతో సొంతంగా టౌన్ ప్లానింగ్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకుంటే 24 గంటల్లోనే ప్లాన్‌లు ఆటోమేటిక్‌గా మంజూరయ్యేలా తీసుకొచ్చిన కొత్త విధానంలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు ఉన్నతాధికారులు చెబుతున్నారు.

కంకర వేశారు.. తారు మరిచారు

● ఇదీ బొబ్బిలి - శంబర రోడ్డులో పరిస్థితి

బొబ్బిలి రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి నుంచి దిబ్బగుడ్డివలస, మక్కువ, శంబర వెళ్లే రోడ్డు పనుల్లో భాగంగా కంకర వేసి తారు వేయడం మరిచిపోయారు. శంబర పండగ నేపథ్యంలో సంక్రాంతికల్లా రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని బొబ్బిలి నుంచి దిబ్బగుడ్డి వలస, మక్కువ, శంబర వెళ్లే రోడ్డు గోతులు కప్పడానికి, రహదారి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. అయితే కంకర పోసి నెలలు గడుస్తున్నా తారు వేయకపోవడంతో ప్రయాణికులు, వాహనచోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. కాగా ఇంకా బిల్లులు చెల్లించలేదని, పరిశీలించి పనులు పూర్తిచేస్తామని రహదారుల ఏఈ శ్రీనివాసరావు తెలిపారు.



బొబ్బిలి- దిబ్బగుడ్డివలస రహదారిలో రాళ్లు తేలిన దృశ్యం

కార్మికుల సంక్షేమంపై దాటవేత ధోరణి తగదు

● ఈపీఎఫ్ పెన్షన్‌దారుల సంఘం నాయకుడు శంకరరావు

బొబ్బిలి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమంపై కేంద్ర ప్రభుత్వం దాటవేత ధోరణి అనుసరించడం తగదని ఈపీఎఫ్ పెన్షన్‌దారుల సంఘం జిల్లా నాయకుడు పి.శంకరరావు కోరారు. ఆదివారం బొబ్బిలిలో విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో ఈపీఎఫ్ పెన్షన్‌దారులకు జరిగిన అన్యా యానికి నిరసనగా మంగళవారం విజయనగరం పీఎఫ్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తామని తెలిపారు. కనీసపెన్షన్ రూ. 900 ప్రకటించాలని, ఉచిత వైద్యం, రైలు ప్రయాణంలో రాయితీ కల్పించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా 78 లక్షల మంది ఈపీఎఫ్ పెన్షన్‌దారులకు కేంద్ర ప్రభుత్వం మొండిచెయి చూపడం అన్యాయమన్నారు. సామాజిక పెన్షన్ కన్నా తక్కువ మొత్తంలో అందిస్తుండడం దుర్మార్గమన్నారు. సమావేశంలో వి.శేషగిరి, టీబీ అప్పారావు, ఎం.శంకరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్మిక నాయకులు

పగటి కలలు కనడం జగన్ మానుకోవాలి

రామభద్రపురం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): విశ్వసనీయత, విలువల గురించి వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని టీడీపీ మండలాధ్యక్షుడు కరణం విజయ భాస్కరరావు తెలిపారు. జగన్ పగటికలలు కనడం మానుకోవాలని హితవుపలికారు. ఆదివారం రామభద్రపురంలో విలేకరులతో మాట్లాడుతూ రాజకీయాలను భ్రష్టు పట్టించి రాష్ట్రాన్ని నాశనం చేసిన జగన్ నోట నీతి వ్యాఖ్యాలు పలకడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. రాష్ట్రంలో 30 ఏళ్లు అధికారంలో ఉం టానని జగన్‌పగటి కలలు కంటున్నారని ఎద్దేవాచేశారు. తల్లిని, చెల్లిని గౌర వించలేని జగన్ కార్యకర్తలకు ఏమి భరోసా ఇస్తారని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని విభజించిన కాంగ్రెస్ పార్టీకి పట్టిన గతే వైసీపీకి పడుతుందని తెలిపారు. సమావేశంలో టీడీపీ అధికార ప్రతినిధి బెవర చిన్నారావు పాల్గొన్నారు.

నేడు నులిపురుగుల నివారణ కార్యక్రమం

రామభద్రపురం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి):మండలంలో సోమవారం జరగనున్న నులిపురుగుల నివారణ కార్యక్రమం విజయవంతం చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారి పి.దిలిప్‌కుమార్ కోరారు. ఆదివారం రామభద్రపురం పీహెచ్‌సీలో అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలు, వైద్య సిబ్బంది సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ డీవార్మింగ్ డే పురస్కరించుకుని రెండు నుంచి 19 సంవత్సరాలలోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వాలని కోరారు. దీని కోసం పీహెచ్‌సీ పరిధిలో 28 అంగన్‌వాడీ సెంటర్లు, 26 ప్రాథమిక పాఠశాలలు, మూడు ప్రైవేటు పాఠశాలలు, ఒక కళాశాలలో 4 వేల 35 మందిని గుర్తించామని తెలిపారు. సమావేశంలో డాక్టర్ ఏఎల్‌జీ శిరీష, మేల్ వర్కర్ నడిమింటి వాసుదేవరావు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వృద్ధుడికి గాయాలు

బొబ్బిలి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి రైల్వే ప్లాట్‌ఫారం శివారున ఆదివారం పట్టాలు దాటుతుండగా సమతా ఎక్స్‌ప్రెస్ ఢీకొన్న ఘటనలో పక్కి గ్రామానికి చెందిన వృద్ధుడు బంకురు రాము గాయపడ్డాడు. హెచ్‌సీ ఈశ్వరరావు కథనం మేరకు.. విశాఖ నుంచి పార్వతీపురం వైపు వెళ్తున్న సమతా రైలురాకను పట్టాలు దాడుతున్న వృద్ధుడు గమనించలేదు. దీంతో ఆ సమయం లో ఆయన కుడి కాలికి తీవ్ర గాయమైంది. ఈ షాక్‌తో ఆయన నోట మాట రాలేదు. తన గురించి ఏమీ చెప్పలేకపోయాడు. రైల్వే హెచ్‌సీ బండారు ఈశ్వరరావు గాయపడిన వ్యక్తికి సంబంధించిన వారెవ రైనా తమను సంప్రదించాలని ఫోటోతో సహా సోషల్‌మీడియాలో పోస్టు చేశారు. తెలుసుకున్న బంధువులు పక్కి గ్రామం నుంచి వచ్చారు. దీంతో గాయపడిన వ్యక్తి రాముగా గుర్తించారు. అనంతరం స్థానిక సీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేయించిన అనంతరం మెరుగైన చికిత్స కోసం విజయనగరం తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిర్వహణ లేక.. విద్యుత్ దీపాలు వెలగక

● అంధకారంగా సీతంపేట

● పట్టించుకోని పంచాయతీ అధికారులు

సీతంపేట రూరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సీతంపేట గ్రామంలో కారుచీకట్లు కమ్ముకున్నాయి. సుందర సీతంపేటలో భాగంగా ఐటీడీఏ ఆధ్వర్యంలో గ్రామంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రత్యేక నిధులు వెచ్చించి సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. అయితే వీటి నిర్వహణను పంచాయతీ అధికారులు విస్మరించారు. దీంతో విద్యుత్ దీపాలు సరిగ్గా వెలగడం లేదు. దీంతో గ్రామంలో అంధకారం అలముకుంటోంది. ఈ సెంట్రల్ లైట్లు ఒక రోజు వెలిగితే ఒకరోజు వెలగని పరిస్థితి ఉంది. నిర్వహణ లోపం కారణంగా మరికొన్ని లైట్లు మరమ్మతులకు గురయ్యాయి. సాయంత్రం అయితే గ్రామం అంధకారంగా మారుతోంది. సీతంపేట వాసులు ఇబ్బందులు పడుతున్నారు.

పీవో దృష్టికి తీసుకు వెళ్తాం

ఇటీవల ఎంసీపీలను మరమ్మతులు చేయించాం. అయినప్పటికీ విద్యుత్ దీపాలు సరిగ్గా వెలగడం లేదు. దీనిపై ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకువెళ్లి సరి చేయిస్తాం.

- రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి, సీతంపేట



వెలగని విద్యుత్ దీపాలు

ఏది నిజం?

(ఐదో పేజీ తరువాయి)

ప్రచురితమైన వార్తకు స్పందించిన డీఎంహెచ్‌వో జీవనరాణి అదేరోజున ఏరియా ఆస్పత్రిని విజిట్ చేసి ముందు రోజు సాయంత్రం ఏం జరిగిందినేది ఆరా తీశారు. వైద్యులు, సిబ్బందిని విచారించారు. గైనకాలజిస్టులు అందుబాటులో లేని విషయాన్ని గుర్తించారు. నిర్లక్ష్యం జరిగినట్టు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. వైద్యులు, సిబ్బంది తీరుపై అసహనం వ్యక్తం చేశారు. మార్గమధ్యలో బాధితురాలు గౌరమ్మకు ఏమైనా జరిగుంటే ఎవరు బాధ్యత తీసుకుంటారని కూడా ప్రశ్నించారు. దీనిపై విచా రించి నివేదిక ఇవ్వాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీష్‌ను ఆదేశించారు.

ఎన్నెన్నో ప్రశ్నలు.. సందేహాలు

విచారణ జరుగుతున్న సమయంలో ఇదే ఘటనపై స్పందించిన డీసీహెచ్ఎస్ రాజ్యలక్ష్మి శనివారం ఏరియా ఆస్పత్రిని సందర్శించి ఘటనపై ఆరా తీశారు. సిబ్బందితో మాట్లాడాక ఏరియా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది తప్పులేనేలేదని తేల్చేశారు. తప్పంతా చల్లపేట పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బందిదేనని కూడా మీడియాకు ప్రకటించేశారు. ఈనెల 4న చల్లపేట పీహెచ్‌సీకి గర్భిణీ వైద్య పరీక్షలకు వెళితే నొప్పులతో బాధపడుతున్న ఆమెను ఇంటికి పంపేశారని చెబుతూనే చల్లపేట వైద్యులు ఘోషాస్పత్రికి రిఫర్ చేశారని, అలాంటప్పుడు ఏరియా ఆస్పత్రికి తీసుకురావడమేంటని అంటూ వారు (108) కూడా బాధ్యులే అన్నట్టుగా వ్యాఖ్యానించా రు. గర్భిణి ఏరియా ఆస్పత్రికి వచ్చినప్పుడు వైద్యులు, సిబ్బంది, సూపరింటెండెంట్ అస్పత్రిలో ఉన్నారని చెప్పు కొచ్చారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటే నాలుగు దాటాక వైద్యులు అందుబాటులో వుండరని తెలియదా అంటూ 108 సిబ్బందితో ఆమె వాగ్వాదానికి ఎందుకు దిగినట్టు...? అంతమంది అందుబాటులో వుంటే గర్భిణికి ఎందుకు తోడ్పాటు అందించలేదు? తల్లీబిడ్డ ప్రస్తుతం క్షేమంగా వున్నారు కానీ వారికి ఏమైనా జరిగి ఉంటే ఆ లోటును ఎవరు పూడుస్తారు? అన్న ప్రశ్నలకు వైద్యులే సమాధానం చెప్పాలి. బాధితురాలు గౌరమ్మ, చల్లపేట పీహెచ్‌సీ వైద్యులు, 108 సిబ్బంది, డీఎంహెచ్‌వో వెర్షన్ ఒకలాఉండగా, డీసీహెచ్ఎస్ రాజ్యలక్ష్మి వివరణ ఇందుకు పూర్తి భిన్నంగా ఉండడం చర్చనీయాంశంగా మారింది. ఇందులో ఎవరిది నిజం? ఏది అసత్యం? అనేది ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఏరియా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పొరపాటు లేకపోతే సంఘటన జరిగిన రోజు సీసీఫుటేజీలను డీసీహెచ్ఎస్ ఎందుకు సేకరించారు? సిబ్బంది నుంచి పలుమార్లు వివరణ ఎందుకు కోరారు? ఇంటి గుట్టు బయటపెడితే ఎలా అని 108 సిబ్బందిని వారించడం వెనుక ఆంతర్యం ఏమిటి? మీడియాకు సమాచారం అందిస్తే ఇక ఉపేక్షించేదిలేదని ఓ వైద్యుడు సిబ్బందికి ఎందుకు వార్నింగ్ ఇవ్వాల్సి వచ్చింది? వీటికి సమాధానం చెప్పాలని రోగులు కోరుతున్నారు. ● ఈ ఘటన కలెక్టర్ అంబేడ్కర్ దృష్టికి వెళ్లినట్టు ప్రచారం జరుగుతున్న క్రమంలో బాధ్యుల్ని కాపాడేందు కు ప్రయత్నాలు జరుగుతున్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారులు నిజానిజాల నిగ్గుతేల్చాలన్న డిమాండ్ ఊపందుకుంటోంది. ము న్ముందు ఈ ఎపిసోడ్ మరెన్ని మలుపులు తిరుగుతుం దో చూడాలి.

ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకోవాలి

● ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జేసీ రాజు

బొబ్బిలి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యారంగాన్ని, పాఠశాలలను రక్షిం చుకోవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జేసీ రాజు పిలుపునిచ్చారు. ఆ బాధ్యత మనందరిపై ఉందని, ఇందుకోసం తల్లి దండ్రుల సహకారంతో పో రాటాలకు సిద్ధం కావాలని కోరారు. ఆదివారం బొబ్బిలి ఎన్‌జీవో హోంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవో-117 రద్దుకు సంబంధించి ప్రభుత్వం అస్పష్టమైన వైఖరిని అవలంబిస్తోందని ఆరో పించారు. జీవో- 117 రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో మోడల్, ఫౌండేషన్ స్కూల్స్‌గానో మార్చుతామనడం సరికాదన్నారు. ఫౌండేషన్ పాఠశాల వ్యవస్థను వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. 12 వ వేతన సంఘాన్ని నియమించాలని డిమాండ్ చేశారు.సమావేశంలో జోగినాయుడు, ప్రవీణ్‌కుమార్,నాగేశ్వరరావు, శ్రీను, ఎల్లయ్య, దర్శనం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ రాజు

లక్ష్యంతో పనిచేయాలి: బొత్స

బొబ్బిలి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తోటివారికి సహాయపడాలన్న లక్ష్యంతో పనిచేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ కోరారు. ఆదివారం బొబ్బిలి అప్పయ్యపేటరోడ్డులో తూర్పుకాపు సామాజికవర్గ ఆత్మీయ కలయిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బొత్స మాట్లాడుతూ సామాజిక వర్గంలో లేనివాడిని ఉన్నవాడు ప్రోత్సహిస్తూ అందరి ఎదుగుదలకు కృషి చేయాలన్నారు. తూర్పుకాపు సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్విని మాట్లాడుతూ ఎవరికి ఎటువంటి సమస్య వచ్చినా పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు. కుల పెద్దలు రౌతు రామ్మూర్తి, లంక రమేష్, బొత్స అప్పులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు, చేడిగంజి రమేష్‌నాయుడు, గురాన అయ్యలు, డాక్టర్ రెడ్డి రవికుమార్ పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతీదేవి విగ్రహావిష్కరణ

బొండపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురువాడ పంచాయతీలోని కొత్త పనసలపాడు ప్రాథమిక పాఠశాలలో ఆదివారం సరస్వతీదేవి విగ్రహాన్ని ఎంఈవో-2 అల్లు వెంకటరమణ ఆవిష్కరించారు. విజయనగరంలోని శారదాపీఠం విగ్రహాన్ని పాఠశాలకు అందజేసింది. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం పూడి మహేష్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

నేటి నుంచి దివ్యాంగ పింఛన్ల పరిశీలన

గరుగుబిల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దివ్యాంగ పింఛన్లను సోమవారం నుంచి పరిశీలిస్తామని ఎంపీడీవో జి.పైడితల్లి తెలిపారు. ఆదివారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఈనెల 10 నుంచి 25వ తేదీ వరకు పాలకొండ ఏరియా ఆసుపత్రిలో దివ్యాంగ పింఛన్‌దారులను తనిఖీ చేస్తారని తెలిపారు.

సెలవు రోజుల్లోనూ మధ్యాహ్న భోజనం

● సంతోషం వ్యక్తం చేస్తున్న పదో తరగతి విద్యార్థులు

వీరఘట్టం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సెలవు రోజుల్లో కూడా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ.. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని అందజేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతోంది. మండలంలో పది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 475 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. ఈ సంవత్సరం నుంచి ప్రభుత్వ ఆదేశాలు మేరకు సెలవు రోజుల్లో నిర్వహించే ప్రత్యేక తరగతులకు వచ్చే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది కంటే ఉత్తమ ఫలితాలు సాధించానికి అటు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎంతో కష్టపడుతున్నారు. సెలవు రోజుల్లో కూడా ఆయా సబ్జెక్టు ఉపాధ్యాయులు వచ్చి విద్యార్థులకు పాఠ్యాంశాలలో ఉండే సమస్యలను నివృత్తి చేస్తున్నారు.



పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థినులు

మంచి ఫలితాలు సాధిస్తాం

గత ఏడాది కంటే ఈ ఏడాది మండలంలో పదో తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా కృషి చేస్తున్నాం. విద్యార్థులకు సెలవు రోజుల్లో ప్రత్యేక తరగతులతో పాటు మధ్యాహ్న బోజనం కూడా అందజేస్తున్నాం.

- ఆర్.ఆనందరావు, ఎంఈవో, వీరఘట్టం

పెణసాంలో గోశాల నిర్మాణంపై రచ్చ

గంట్యాడ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెణసాంలో గోశాలలు నిర్మాణాలుపై రచ్చ జరుగుతుంది. గోశాలలు మంజూరైన రైతులకు భూముల హద్దులు గుర్తించి రెవెన్యూ అధికారులు ఇచ్చిన చోట కాకుండా వేరోచోట నిర్మించడంతో ఉన్నతతాధికారులకు ఫిర్యాదులు అందాయి. పశువులు లేకుండా గోశాలలు మంజూరు చేశారంటూ ఆరోపణలు ఉన్నాయి. గ్రామంలోని 11 గోశాలలను మంజూరు చేశారు. వీటిల్లో 10 పశువులు సంబంధించిన షెడ్డుల కాగా, ఒకటి మాత్రమే గొర్రెలకు షెడ్డు. అయితే ఇవి నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరగడంతో సమస్య అధికారులు వద్దకు చేరింది. ఇదే విషయం ఎంపీడీవో రమణమూర్తి వద్ద విషయం ప్రస్తావించగా రెవెన్యూ కార్యదర్శి ఇచ్చిన ధ్రువపత్రం ప్రకారం రైతులు నిర్మించుకోవడంతో బిల్లులు పెట్టామన్నారు. దీనిపై ఏమైనా సమస్య ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్తామన్నారు.

గిరిజనులపై దౌర్జన్యం ఆపాలి

సాలూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గిరిజనులపై ఒడిశా ప్రభుత్వం దౌర్జన్యం ఆపాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల కమిటీ కార్యదర్శి గెమ్మెల జానకి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం దులిభద్ర గ్రామంలో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొఠియా సరిహద్దు గ్రామాల గిరిజనులపై ఒడిశా ప్రభుత్వం వేధింపులకు దిగడం సరికాదన్నారు. అభివృద్ధి పనులు సామగ్రిని తీసుకుని వెళ్లడం, గిరిజన కూలీలను నిర్బంధించటం సరికాదని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకు లు తొడంగి సన్నం, చోడిపల్లి రాజు, సుబ్బారావు, బిరుసు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

వ్యక్తిగత దూషణపై కేసు నమోదు

తెర్లాం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): తెర్లాం గ్రామానికి చెందిన కంకణాల కిరణ్‌పై వ్యక్తిగత దూషణ కింద కేసు నమోదు చేశామని ఎస్ఐ సాగర్‌బాబు ఆదివారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. తెర్లాం గ్రామానికి చెందిన ఓ యువతి జి.సిగడాంలో చదువుకుంటోంది. సెలవుకు ఇంటికి వచ్చినప్పుడు తనపై కిరణ్ తప్పుడుగా ప్రవర్తించాడని ఆమె శనివారం ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

న్యూస్ బాక్స్

మద్యం సీసాల స్వాధీనం

కురుపాం, ఫిబ్రవరి9 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం అమ్మకాలు చేపడుతున్న వారిపై దాడులు జరిపి, మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. అక్రమంగా మద్యం అమ్ముతున్న తురకనాయుడువలస గ్రామానికి చెందిన రెడ్డి జోగమ్మ వద్ద ఏడు సీసాలు, కురుపాంకు చెందిన పొట్నూరు గుంపస్వామి వద్ద 10 సీసాలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ దాడులలో ఎస్ఐ జె.రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

పారా క్రికెట్ పోటీల్లో సత్తా చాటారు



ట్రోఫీతో భామిని యువకులు

భామిని, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గుంటూరులో నిర్వహించిన మహాఉత్సవ్ టోర్నమెంట్‌లో భామిని మండలానికి చెందిన యువకులు సత్తా చాటారు. రాష్ట్ర స్థాయిలో దివ్యాంగులకు నిర్వహించిన ఈ పారా క్రికెట్ టోర్నమెంట్‌లో పార్వతీపురం మన్యం జిల్లా రన్నర్‌గా నిలిచింది. ఈ జట్టులో భామిని మండలం నేరడి గ్రామానికి చెందిన కె.శ్రీను కెప్టెన్‌గా వ్యవహరించారు. ఆయనతో పాటు కె.డిల్లేశ్వరరావు, ఎస్.గోవింద, వినోద్‌లు భామిని మండలానికి చెందిన వారు ఉన్నారు. వీరిని స్థానికులు అభినందించారు.

రైతులకు భూ ఆధార్ తప్పనిసరి

సీతంపేట రూరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రతి రైతు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య(యూనిక్ ఐడీ) కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏవో శ్రీదేవి తెలిపారు. ఆదివారం ఓ ప్రకటన ద్వారా వివరాలను వెల్లడించారు. రైతులు ఈ నెలాఖరు నాటికి రిజిస్ట్రేషన్ చేసుకుని భూ ఆధార్ పొందాలని సూచించారు. రిజిస్ట్రేషన్ కోసం రైతులు రైతు సేవా కేంద్రం, వ్యవసా య సహాయకులను సంప్రదించాలన్నారు.

నిత్యావసరాల పంపిణీ

బొబ్బిలి రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీహెచ్ బొడ్డ వలస పంచాయతీ పరిధిలోగల చినఅక్కేనవలసలో ఆదివారం వనమిత్ర కె.కృష్ణదాస్ ఆధ్వర్యంలో పది గిరిజన కుటుంబాలకు దుస్తులు, నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహిళలు, పెద్దలు పాల్గొన్నారు.

సంప్రదాయ కళలపై శిక్షణ

బొబ్బిలి రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కోమటిపల్లిలో మార్చి 15 నుంచి సంప్రదాయ కళలపై వేసవి శిక్ష ణ తరగతులు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బొంతల కోటి శంకరరావు తెలిపారు. స్థానిక కళా మందిరంలో నాట్యం, కోలాటం, తూర్పుభాగవతం తదితర సంప్రదాయ కళలపై, ఇంగ్లీషు, గణితం సబ్జెక్టులపై శిక్షణఇవ్వనున్నట్టు తెలిపారు.